# "మృగతృష్ణ" ★

రచన:
యం. చక్రపాణి

అతని కా పూరంతా క్రొత్తగా కనిపిస్తుంది. పదిహేనేండ్లక్రితం తాను నాటినమఱ్ఱిమొక్క యీనాడు పచ్చని ఆకులతో నిగనిగ లాడుతూ బాట ప్రక్కన పాంథులను చల్లని ఛత్రంలా కాపాడుతూ ప్రక్కననున్న సన్నతీగెతో కౌగలించుకొంటూ యుంది. ఆ చెట్టు నీడను ఆయాసం తీర్చుకొంటూ అడుగిడిన యాతనిని చూచి ప్రతివారూ వింతగా జూస్తూయున్నారు. గోధుమ రంగు సూటులోనున్న తనని; పదేండ్ల బాలునిగా చెడ్డీపైకిలాక్కొంటూ ముక్కుద్రావకాన్ని ఎగబీలుస్తూ గోధుమ గొట్టములు గూర్చిరోజూ వెళ్ళే కోమటి సుబ్బయ్య యెలా పోల్చగలడు? అప్పటికిన్నీ చిరునవ్వుతో పలకరించాడు. ముక్కుమీద జారిపోతూయున్న కళ్ళద్దాలు సవరించుకొంటూ "ఎవరూ?" అన్నట్లు చూచాడేగాని పలకరించటానికి ధైర్యం చాలలేదు సుబ్బయ్యకి.

డాబా యింటిముందు ఆగాడు. పరాయిమగవారిని చూడగూడదు అని అంతవరకూ వీధి అరుగుమీద కూర్చొని మాట్లాడుతూయున్న 'అనసూయ' తుర్రున యింట్లోకిపారిపోయింది. ఇంటి యజమానురాలు కాంతమ్మ ఏమికావాలన్నట్లు చూచింది. అతనేమి చెప్పగలడు? అమ్మా నీవేకావాలి! అంటే పోల్చగలదా? ఏదో తప్పుచేసినందుకు నాన్నగారు దండిస్తే ప్రాణప్రదంగా చూచుకొంటున్న మాతృహృదయాన్నైనా గమనించక పారిపోయిన తను, పుత్రవియోగంతో కలువరేకుల్లాంటి నయనాలనుండి కన్నీరుకార్పించినతను ఏమని చెప్పగలడు? తలవాల్చుకొని నిలబడిపోయాడు. అప్పుడే భోంచేసి నోటిలోని చుట్ట మూడుసార్లు త్రిప్పి, కళ్లుపెద్దవిజేసుకొని, ఆశ్చర్యంగా చూస్తు "ఎవరండీమీరు?" అనియింటిగుమ్మము నుండి ముందుకు వచ్చాడొకడు. అతన్ని చూడగానే నిలబడియున్న ప్రకాశ్‌కు దుఃఖం పొంగిపొర్లుకొచ్చి "నాన్నా! క్షమించు" అని కాళ్లపైపడిపోయాడు. "ఎవరూ? అబ్బాయ్; నువ్వా?" అని నాన్నమ్మగారు నడుంమీద చెయ్యివేసికొని నిలబడింది. "మీకు తీరని బాధ కల్గించాను. చెప్పకుండా పారిపోయినందుకు క్షమించు నాన్నమ్మా" అని తన పశ్చత్తాపం వెలిబుచ్చాడు. "అరె పిడుగా! యింతవాడవైపోయావ్?" అని ప్రక్కింటి కనకమ్మ కళ్లద్దాలు సవరించుకొంటూ చిన్నపలకరింపుపారేసింది. "అన్నయ్యా, అన్నయ్యా" అని చుట్టూ చేరారు ముగ్గురు పిల్లలు. వారికి బిస్కట్లు అందిచ్చాడు ప్రకాశ్!

ప్రక్కింటి 'పద్మ' తాను వచ్చిన దగ్గఱనుండి తనను కొరుక్కుతిన్నట్లు చూస్తుంది. పదేపదిసార్లు తన యింటికి వస్తూపోతూ ఒక్కొక్క చిరునవ్వుగూడా సమర్పించుకొంటూయుంది. చెల్లెలు అనసూయతో గంటలతరబడి వ్యర్థ సంభాషణజేస్తూ యుంది. ఆమె చేష్టలతనికి అర్థముగాలేదు.

ఒకనాడు ప్రకాశ్ చెరువుగట్టున కూర్చొని పూర్వస్మృతులు పునశ్చరణజేసికొంటూయున్నాడు. దూరంలో పద్మ నీళ్లబిందె చంకను పెట్టి గట్టెక్కి నిలబడి సన్ననవ్వు విసరింది. అతనికిప్పుడర్థమైంది. ఆమెకతడు కావాలి. అందుకే జనసంచలనములేని సమయంలో ఒంటరిగా నున్న తనను కలిసికొనేందుకు వచ్చింది. అందంలో తీసిపోదు. బిగువైన సొగసుగల మగువ! యవ్వనాంకురాలు సవ్వడిచేస్తూ యుండగా విహ్వల మనస్కురాలై యున్నజవ్వని! విద్యావతి! కోరుకొన్న కోమలి! పిల్లనాటి ప్రేయసి!! అవకాశాన్ని జారవిడువరాదు. సమీపించి "పద్మా! నన్ను మరువలేదుగదా?" అని వంచియున్న శిరస్సుని అతనివైపు త్రిప్పుకొన్నాడు. సిగ్గుతో అతని గుండెల్లో తలదాచుకొన్నది.

* * *

హౌరాస్టేషనులో బండి ఆగింది. ప్రకాశ్ పద్మలు బండిదిగారు. తుదిమొదలు తెలిసికోలేక పద్మప్లాట్‌ఫారం మీద భిక్కమొహంతో చూస్తూ యుంది. కూలివానితో సామాను పట్టించుకొని పద్మచేయిచేట్టుకొని ప్రకాశ్ తిన్నగా టాక్సీ స్టాండుకు చేరాడు. ఇరువురూ టాక్సిలోకూర్చున్నారు. చీమలబారులా సాగుతూ, ఒకరినొకరు నతిక్రమించిపోవటానికి ప్రయత్నిస్తూయున్న బస్సులు - ట్రాములు - టాక్సీలు - హౌరా బ్రిడ్జిపై చూచి పద్మ బేజారెత్తిపోయింది. టాక్సి చౌరంఘీ స్ట్రీటులో ప్రవేశించింది. ఒకమలుపులో కారుతో ఢీకొనబోయింది డ్రైవరు సడన్‌బ్రేకు వేశాడు ఒక్కసారి పద్మ ముందుకు తూలిపోతూ 'అబ్బో' యుంది. ప్రకాశ్ ఆమెను అందుకొని ధైర్యంచెప్పి నడుంచుట్టూ చేయివేసి గట్టిగా పట్టుకొన్నాడు. యవ్వన జీవులకు కావలసింది అంతకన్నా యేముంది? సిమెంటు రోడ్డుపై దూసుకపోయే కారులో ప్రియుని కౌగలింతలో కుషన్ సీటులో కూర్చొని ప్రయాణం చేస్తుంటే; అందులో మహానగరంలో, ఒడలుపులకరించే వాతావరణంలో, నయనానందకరదృశ్యాల మధ్యపోతూయుంటే పద్మ తన్మయత్వంలో "ఎంతహాయి!" అని భుజం మీద వ్రాలిపోయింది. అది సహజంగూడా! కిద్దర్‌పూర్‌లో నాట్‌గంజ్ స్ట్రీట్‌లో ఒక ఇంటిముందు టాక్సీ ఆగింది. ఇల్లు యిరువురికిన్నీ సరిపోయినట్లుంది. అందులో నూతనకాపురం వెలిగించసాగారా ప్రియతములు.

నెల గడచింది. ఇంటిహంగులన్నీ కూర్చుకొన్నారు. చిలకా గోరువంకల్లా షికార్లు చేస్తున్నారు! శశి కమలముల వలె చిరునవ్వులు చిందులాడిస్తు ఉన్నారు. మాలతీ మధుపములవలె మాధుర్యాన్ని గ్రోలుతున్నారు! వారికీ నెలకాల గమనము గూడా వలపునకు రాలేదు.

కోటు భుజాన్న వేసుకొని బూటు తొడుక్కొంటుంటె 'యెక్కడికని పద్మ అడిగింది డ్యూటీకన్నాడతడు' మీరు లేకపోతే యెవరితో యెలా గడపను? తెలుగు మాట్లాడే వారెవరూ లేని చోటులో యెలా వెలగడం?" అని మూతిబిగించుకొని ముందుకు వచ్చింది? "పద్మా! వుద్యోగంలేకపోతే యెంత

కాలం హాయినిలువగలదు?" అని చిటికె వేస్తూ వెళ్ళిపోయాడు ఆదినం పద్మకు బాగాగఢువలేదు. సాయంకాలానికి చిరిగిపోయిన షర్టుపై కోటు వేలాడదీస్తూ చేరాడింటికి ప్రకాశరావు. అతన్ని చూడనే ఏమైందన్నట్లు చూచింది ఆశ్చర్యంగా "బస్సు బోల్తా కొట్టింది అబ్బా! ఒళ్లంతానొప్పులు!" అని కుర్చీలో కూలబడ్డాడు. కావలసిన సపర్యలుచేసిందామె.

అనాడామెకు తలనొప్పిగా యుంది. ప్రకాశ్ యింట్లోలేడు. ఏమి తోచక



యింట్లోకూర్చొని ఏదోదీర్ఘంగా ఆలోచిస్తూ యుంది. ఇంతలో యింటి ముందు శబ్దంకాగా వచ్చిచూచింది. ఆశ్చర్యం! తన తనకళ్లు గట్టిగా మూసుకొని చూచింది. ప్రకాశ్! సంకెళ్లలో ప్రకాశ్!! పోలీసులమధ్య ప్రకాశ్!!! ప్రకాశ్ అని పోయి కౌగలించుకొని "ఏమైంది? ఎందుకు నిన్ను బంధించారు?" అని అడిగింది,

"నేను చేసిన తప్పుకు నన్నుబంధించారు.!"

"ఏం చేశావ్?" అని ఆశ్చర్యంగా చూచింది.

"ఏం చెయ్యాలి? నిన్ను, నీ జీవితానికి ద్రోహంచేశాను కన్యను చెరచిన పాపానికి శిక్ష" అని కన్నీళ్ళు రెండు జార్చాడామె కంటిమీద.

"లేదు ప్రకాశ్. నా జీవితాన్ని నాశనంచెయ్యలేదు. నేనే నిన్ను కోరివరించాను. ఈ సంగతి కోర్టులో నిర్భయంగా చెప్పి నిర్దోషివని నిరూపిస్తాను"

'కాదు పద్మా! నీ ప్రేమత్యాగానికి నా జీవితంధన్యమైంది. గాని నేనిప్పుడు బంధించబడినది ఆ నేరారోపణపైగాదు. నివుసహించనినేరం చేశాను. ఆ సంగతి నీకు తెలియదు. నేనిప్పుడు దొం...గ. ను..."

పద్మ తెల్లబోయింది. "దొంగతనమా? మీరు దొంగతనము చేశారా?'

ఆవును! అదే నేను కలకత్తాలో చేస్తున్నవృత్తి పదేండ్లబాటుగా యిక్కడికి చేరుకొన్న తరువాత వరుసగా మూడుదినములు భోజనం గూడా చిక్కనినాడు కాఫీ హొటలులో ఈ విద్యకు పూజపట్టాను. పరోపకారహృదయంతో ప్రవర్తించినన్నాళ్ళూ ఈ విద్య రాణించి నన్నింత వాణ్ణిజేసింది. మోసం నా బుద్ధిలో జొరబడి నిన్ను వంచించిన తరువాత నాచోరశక్తి సన్నగిల్లింది. అందుకే చిక్కిపోయాను అన్నాడు

"ఏదో వుద్యోగం చేస్తూ యున్నానన్నావే?" ఆశ్చర్యాన్ని కనబరుస్తూ అడిగిందిపద్మ. ప్రకాశ్ నవ్వాపలేకపోయాడు "నేను చేస్తున్నఉద్యోగము యిన్‌కమ్ టేక్సాఫీసులో అని చెప్పాను కదూ! జేబులు బరువుగానుంటేనే పన్నువిధించడం నాడ్యూటీ అదిచెల్లినవారికు హొదా వెలిగిస్తాను కష్టాల్లో వున్నవారిని ఆదుకొంటాను.

"ఎంత మోసం!" అని బెదురు చూపుల్తో చూచింది పద్మ అతని మొహంలోనికి.

"భయపడకు పద్మా" నా మాటల తీయదనం వెనుకగల విషం నీకు తెలియక ప్రేమించావు. నా దుస్తుల్లో దాగిన ప్రజాశాపాలు నీకు తెలియక హృదయమిచ్చావు. నా అందం మరుగునగల చోరప్రతిబింబం కానక, నాతో ఎవరికీ తెలియజేయకుండా వచ్చావు. మహానగరంలో మహారాణిలా గడపగలనని ఉవ్విళ్ళూరే నికోరిక నింతటితో త్రెంచుకో! పట్టణాల్లో పయోముఖ విషకుంభాలు ప్రజ్వలకాంతిలో ప్రకాశిస్తూ యుంటాయని తెలిసికో! సిటీలో సుఖవాంఛలు, సుఖజీవనము లభిస్తుందని భ్రమిశావు. ఆదంతా మరుమరీచికల మయంచినీరు. మార్తాండ శిఖతాండవము! నాహృదయం మాత్రం నిన్ను విడనాడదు. నేను నిన్ను మోసగించలేదు. హృదయపూర్వకంగా కోరుతున్నాను. ఇదిగోచీటి దీన్ని ఇంటిప్రక్కాయన కిచ్చావంటే ఆతడేనిన్ను రైలు యెక్కిస్తాడు. నన్నుమాత్రం విశ్వసించు పద్మా! నేను కావాలనిచేసిననేరంగాదు. పొట్టకోసం కట్టుతప్పిన చిన్నతనంలో నేర్చనవిద్య." అంటూ జీపులోకూర్చొబడ్డాడు ప్రకాశ్. కన్నీరు మున్నీరుగా యేడుస్తూ పద్మ కూలబడింది. ఇకనైనా మేలుకో! అని చీటీహెచ్చరిస్తున్నట్లు కాగా, దాన్నిపట్టుకొని ప్రక్కింటి కెళ్లింది పద్మ. ★